క్లుప్తంగా

ఇంటి బాట పట్టిన విద్యార్థులు

సీతంపేట: గిరిజన సంక్షేమ విద్యా సంస్థలకు బుధవారం నుంచి దసరా సెలవులు ఇవ్వడంతో తల్లిదండ్రులు తమ పిల్లలను మంగళవారం ఇళ్లకు తీసుకువెళ్లారు. గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలు, గురుకులాలు, కేజీబీవీ, మినీగురుకులాలకు చెందిన విద్యార్థులు వెళ్లిపోవడంతో పాఠశాలల వసతిగృహాలు ఖాళీ అయ్యాయి. ఈ నెల 14న పాఠశాలలు మళ్లీ పునఃప్రారంభం కానున్నాయి.

సమాజానికి దిక్సూచి సీనియర్ సిటిజన్



హోంలో వృద్ధులను సన్మానిస్తున్న వైద్యులు, నిర్వాహక ప్రతినిధులు

పాలకొండ రూరల్: సీనియర్ సిటిజన్లు సమాజానికి దిక్సూచి అని వైద్య నిపుణులు ఐఏఎస్ పట్నాయిక్ అన్నారు. అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం సందర్భంగా స్థానిక బాలగోపాల లక్ష్మీనరసమ్మ ఓల్డేజ్ హోంలో మంగళవారం ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టారు. హోం నిర్వాహకులు శ్రీనివాసరావు, అధ్యక్షుడు నందాన సుధాకర్, జి.రమానంద్ తదితరుల నేతృత్వంలో హోంలో ఆశ్రయం పొందుతున్న వృద్ధులకు సన్మానించారు. హోం ప్రతినిధులు సింహాచలం, రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ



విద్యార్థులకు స్టడీమెటీరియల్ అందజేస్తున్న జీసీడీఓ రోజారమణి

జియ్యమ్మవలస: మండలంలోని పెదమేరంగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు ఇంగ్లిష్ స్టడీ మెటీరియల్‌ను అసిస్టెంట్ జీసీడీఓ కర్రి రోజారమణి మంగళవారం ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రానున్న దసరా సెలవులు, వార్షిక పరీక్షలను దృష్టిలో ఉంచుకొని సమయాన్ని వృథా చేయకుండా ఉండేందుకు స్టడీ మెటీరియల్ అందజేసినట్లు తెలిపారు. విద్యార్థులు వాటిని వినియోగించుకొని అత్యధిక మార్కులు సాధించాలన్నారు. 54 మంది విద్యార్థులకు స్టడీమెటీరియల్ అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.


22న జీసీఎం సంఘం ఎన్నిక

సాలూరు: గిరిజన సహకార మార్కెటింగ్ సంఘం ఎన్నిక ఈ నెల 22న నిర్వహించనున్నట్లు సబ్‌డివిజినల్ కోఆపరేటివ్ అధికారి పద్మజ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 14న నామినేషన్లు స్వీకరించడం జరుగుతుందని, 15న పరిశీలన, 16న ఉపసంహరణ, 22న ఎన్నిక ఉంటుందని తెలిపారు. ఈ సంఘాల్లో ఓటర్లు నామినేషన్ దాఖలు చేయడానికి అర్హులని పేర్కొన్నారు.

నిర్వహణ గ్రాంట్స్ మంజూరుపై హర్షం

పార్వతీపురంటౌన్: ఎంఈఓ కార్యాలయాల నిర్వహణ గ్రాంట్స్ మంజూరు చేసేందుకు సమగ్ర శిక్ష స్టేట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ బి.శ్రీనివాసరావు సానుకూలంగా స్పందించడం పట్ల ఎంఈఓ అసోసియేషన్ ఏపీ రాష్ట్ర అధ్యక్షుడు సామల సింహాచలం సోమవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. గత మూడేళ్లుగా ఎంఈఓ కార్యాలయాల నిర్వహణ నిధులు మంజూరు కాకపోవడంతో ఎంఈఓలు ఇబ్బందులు పడుతున్నారని, సోమవారం జరిగిన విద్యాశాఖ స్టేట్ వెబెక్స్ సమావేశంలో ఎంఈఓ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సామల సింహాచలం ఎస్పీడీకి విజ్ఞప్తి చేయగా, నిధులు మంజూరు చేసేందుకు ఎస్పీడీ హామీ ఇచ్చారన్నారు. గ్రాంట్స్ విషయంలో సానుకూలంగా స్పందించిన ఎస్పీడీకి ఎంఈఓ అసోసియేషన్ పక్షాన ధన్యవాదాలు తెలియచేస్తున్నామని రాష్ట్ర అధ్యక్షుడు సామల సింహాచలం, ప్రధాన కార్యదర్శి బి.రవి నాయక్ పేర్కొన్నారు.

రావికోన వీఓఏను కొనసాగించాలి



నిరసన తెలుపుతున్న ఐద్వా, డ్వాక్రా సభ్యులు

పార్వతీపురంటౌన్: రావికోన పంచాయతీ వీఓఏ ఎం.కన్యాకుమారిని కొనసాగించాలని, గ్రామ సంఘం సభ్యుల సంతకాలను ఫోర్జరీ చేసిన సీసీపై చర్యలు తీసుకోవాలని ఐద్వా నాయకులు వి.ఇందిర అన్నారు. ఈ మేరకు డీఆర్‌డీఏ పీడీ కార్యాలయం వద్ద మంగళవారం నిరసన తెలిపారు. రావికూన పంచాయతీలో పనిచేస్తున్న వీఓఏపై మానసికంగా, రాజకీయంగా ఇబ్బంది పెడుతున్నారన్నారు. గ్రూపు సభ్యుల సంతకాలు ఫోర్జరీ చేసి అన్యాయంగా ఆమెను విధుల నుంచి తొలగించారన్నారు. ఆమెను తిరిగి విధుల్లోకి చేర్చుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు, సీఐటీయూ నాయకులు వై.మన్మథరావు పాల్గొన్నారు.

కోర్కెలు తీర్చే పురటాళ్ల పోలమాంబ

- భక్తుల పాలిట కొంగు బంగారం నీలమాంబ
- రేపటి నుండి శరన్నవరాత్రి ఉత్సవాలకు సర్వం సిద్ధం

పాలకొండ రూరల్: నాగవంశపు వీధిలో కొలువై భక్తుల కోర్కెలు తీర్చే కొంగు బంగారంగా పూజలు అందుకుంటున్న పురటాళ్ల పోలమాంబ ఆలయంలో దసరా ఉత్సవాలకు సర్వం సిద్ధమైంది. పాలకొండ – శ్రీకాకుళం రహదారిలో ఉన్న ఈ ఆలయంలో నవరాత్రులను ఏటా అత్యంత వైభవంగా నిర్వహించటం ఆనవాయితీగా వస్తుంది. స్థానిక కోటదుర్గమ్మ దేవస్థానంలో మాదిరి ఇక్కడి అమ్మవారికి నిత్యపూజలు, అవతారాలతో పాటు ఉత్సవాలను నిర్వహించటం పరిపాటి. ఏళ్ల చరిత్ర ఉన్న అమ్మవారిని స్థానిక నాగవంశీకులు కులదైవంగా ఆరాధిస్తారు. ఈ నేపథ్యంలో 3వ తేదీ ఉదయం శుభలగ్న మందు దసరా ఉత్సవాలకు సంబంధించి ముహూర్తపు రాట వేయనున్నారు. అనంతరం శుభస్తంభ, అమ్మవారి కలశ ప్రతిష్ఠ కార్యక్రమాలను చేపట్టనున్నారు. తొమ్మిది రోజులు జరగనున్న ఉత్సవాలు ఈ నెల 12వ తేదీ విజయదశమి వరకు కొనసాగుతాయి. అదే రోజు అశేష జనవాహిని నడుమ అమ్మవారి తిరువీధి కార్యక్రమం జరగనుంది. ఉత్సవ కాలంలో అమ్మవారికి చేపట్టే నిత్య సంబరాలు, ఘటాలను, భక్తుల దర్శనాలను పర్యవేక్షించేందుకు ఉత్సవ కమిటీ పూర్తి ఏర్పాట్లు చేపట్టింది. తొమ్మిది రోజులు ఆలయ ప్రాంగణంలో సాంస్కృతిక



శరన్నవరాత్రి ఉత్సవాలకు సిద్ధమైన పురటాళ్ల పోలమాంబ

కార్యక్రమాలు, సామూహిక కుంకుమార్చనలు చేపట్టనున్నట్లు అర్చకులు తెలిపారు. నక్కలపేటలో గల జ్ఞానసరస్వతీ ఆలయంలో, నీలమ్మ కాలనీలో గల నీలమాంబ ఆలయంతో పాటు వెంకటరాయుని కోనేటి గట్టుపై ఉన్న ముగ్గురమ్మల ఆల



భక్తుల పాలిట కొంగుబంగారం నీలమాంబ అమ్మవారు

యంలో, అగ్నిమాపక కేంద్రం వద్ద కొలువుదీరిన గ్రామదేవత గారమ్మ అలయంలో, విశాఖ రహదారిలో గల సాయి గాయిత్రీ, శ్రీకాకుళం రహదారిలో కొలువైన పంచముఖ గాయిత్రీ మంత్రాలయంలో దసరా ఉత్సవాలను నిర్వహించేందుకు భక్తులు, ఉత్సవ కమిటీలు ఏర్పాట్లలో నిమగ్నమయ్యాయి.

భారీ వర్షం

పాలకొండ రూరల్: పాలకొండలో మంగళవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. గడిచిన నాలుగైదు రోజులుగా ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరైన ప్రజలు వర్షంతో వాతావరణం చల్లబడడంతో ఉపశమనం పొందారు. మరోవైపు రహదారులు వర్షం నీటితో నిండిపోయాయి. ఆర్టీసీ కాంప్లెక్స్‌లోకి నీరు చేరడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కొద్ది గంటల పాటు విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో వినియోగదారులు ఇబ్బంది పడ్డారు.

మద్యం దుకాణాల బంద్



బత్తిలిలో మూత వేసిన వైన్‌షాప్ వద్ద నిరసన చేస్తున్న సిబ్బంది

భామిని: మండలంలోని ప్రభుత్వానికి చెందిన రెండు మద్యం దుకాణాలు మంగళవారం బంద్ కావడంతో మందుబాబులు అవస్థలు పడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం తీరుకు నిరసనగా దుకాణాల్లో పనిచేస్తున్న సూపర్‌వైజర్లు, హెల్పర్లు దుకాణాలు బంద్ చేశారు. తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. బత్తిలి, భామిని వైన్‌షాపులు మూతపడడంతో మద్యం దొరక్క ఇబ్బందులు పడ్డారు. సరిహద్దులోని ఒడిశా గ్రామాలకు మద్యం కోసం తరలివెళ్లారు.

వీరఘట్టంలో..

వీరఘట్టం: నూతన మద్యం పాలసీతో అతి తక్కువ ధరకే మద్యం అమ్మకాలు చేపడతామని హామీలు గుప్పించిన కూటమి ప్రభుత్వం మంగళవారం మద్యం షాపులను తెరవకపోవడంతో మందుబాబులు గగ్గోలు పెట్టారు. ఎటువంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా వైన్ షాపులు మూసివేసింది. దీనికి తోడు బుధవారం గాంధీ జయంతి కావడంతో వైన్ షాపులకు సెలవు దినం. ఇలా వరుసగా రెండు రోజులు వైన్ షాపులు మూతబడడం మందుబాబులకు మింగుడు పడడం లేదు. దీంతో పలువురు మందుబాబులు సారాకు పరుగులు తీయగా ఇంకొందరు బెల్ట్‌షాపులను ఆశ్రయించి అధిక ధరలకు మందు కొనుగోలు చేశారు. ఇదిలా ఉండగా మంగళవార సాయంత్రం 5 గంటలకు ఎక్సైజ్ శాఖ నుండి ఆదేశాలు రావడంతో వైను షాపులు తెరుచుకోవడంతో మందు బాబులు ఊపిరి పీల్చుకున్నారు.

మిశ్రమ మెట్ట పంటలతో లాభాలు

భామిని: సేంద్రీయ వ్యవసాయ పద్ధతిలో సాగు చేస్తున్న పత్తి పంటలో మిశ్రమ పంటల సాగుతో అదనపు లాభాలు సాధించవచ్చని ప్రకృతి వ్యవసాయ స్టేట్ రిసోర్సుపర్సన్ దేవుళ్లు అన్నారు. మండలంలోని బొడ్డగూడలో వాస్సన్ సంస్థ హెచ్‌డీఎఫ్‌సీ పరివర్తన నిధులతో చేపట్టిన సేంద్రీయ పత్తి పంటను ఆయన మంగళవారం పరిశీలించారు. పలు సూచనలు చేశారు. పత్తిలో చిరుధాన్యాలను అంతర పంటగా సాగు చేస్తుండడం గుర్తించి ప్రయోజనాలు వివరించారు. కారిగూడ, వెంకటగూడలలో సాగు చేస్తున్న సేంద్రీయ పత్తి పంటలో ఊద, కొర్ర గులిరాగి పంటలను పరిశీలించారు. మొదటిగా సేంద్రీయ విధానంలో కూరగాయల సాగుకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. వాస్సన్ ప్రతినిధులు దారపు రెడ్డి శంకరరావు, కీర్తిరాయి సుగ్రీవులు, బిడ్డిక లోకనాథం, ఏపీసీఎన్ఎఫ్ ఎంటీ అంబోజీ, ఆరిక రామారావు, గిరిజన రైతులు పాల్గొన్నారు.



బొడ్డగూడలో సేంద్రీయ పత్తి పంట పరిశీలిస్తున్న దేవుళ్లు, వాస్సన్ ప్రతినిధులు

చెరువును తలపిస్తున్న సీఎస్‌పీ రహదారి

వీరఘట్టం: వీరఘట్టం – పాలకొండ సీఎస్‌పీ రహదారి చెరువును తలపిస్తోంది. గత కొంత కాలంగా భారీ వాహనాలు రావడంతో రోడ్డుపై ఏర్పడిన గుంతల్లో వర్షం నీరు చేరి దారి పొడువునా చెరువులా ఉంది. ముఖ్యంగా వండువ జంక్షన్ నుండి నవగాం జంక్షన్ వరకు సుమారు రెండు కిలోమీటర్ల వరకు రహదారి మొత్తం ఛిద్రంగా మారడంతో వాహనదారులు ఈ రోడ్డుపై ప్రయాణం చేసేందుకు నరకయాతన పడుతున్నారు. ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి ఈ రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.



నవగాం వద్ద రోడ్డుపై వర్షం నీరు చేరడంతో అధ్వానంగా సీఎస్‌పీ రోడ్డు

రైతులు ఆర్థికాభివృద్ధి చెందాలి



పొలం బడి కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

గుమ్మలక్ష్మీపురం: ప్రకృతి వ్యవసాయ విధానాలను అవలంబించి రైతులంతా ఆర్థికంగా అభివృద్ధి పొందాలని ప్రకృతి వ్యవసాయ విభాగం జిల్లా మేనేజర్ పి.షణ్ముఖరాజు అన్నారు. ఈమేరకు మండలంలోని బాతుగుడబ, రాయగడజమ్ము గ్రామాల్లో వ్యవసాయ, అనుబంధ శాఖల ఆధ్వర్యంలో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పెట్టుబడులు తగ్గి, దిగుబడులు పెరిగి, ఆరోగ్యకరమైన ఆహార ఉత్పత్తులు పండించడం, వినియోగించడం వలన రైతులు ఆదాయం పొందవచ్చన్నారు. దీనికి ప్రకృతి వ్యవసాయమే సరైన మార్గమన్నారు. రైతులంతా తమకున్న విస్తీర్ణంలో 365 రోజులూ ఆకు కూరలు, తీగజాతులు, దుంపజాతులు, అపరాలు, పండ్ల మొక్కలతో పాటు వరి, చిరుధాన్యాలు సాగు చేసుకుంటే అనేక ప్రయోజనాలు పొందవచ్చన్నారు. అలాగే వ్యవసాయాధికారి సీహెచ్ ప్రసాద్ మాట్లాడుతూ పంటలకు తెగుళ్లు, పురుగులు ఆశించినట్లయితే వాటిని వెంటనే గుర్తించి నివారణ చర్యలు చేపట్టాలన్నారు.

పింఛన్ల పంపిణీ

గరుగుబిల్లి: మండలంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీని మంగళవారం నిర్వహించారు. సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, వైద్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి పింఛన్లు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు చురుగ్గా పాల్గొన్నారు. మండలంలోని 8,226 మందికి పింఛన్లు పంపిణీ చేయాల్సి ఉండగా 7,901 మందికి(95.82 శాతం) పింఛన్లు పంపిణీ చేశారు. కార్యక్రమాన్ని ఎంపీడీఓ జి.పైడితల్లి, ఈఓపీఆర్‌డీ ఎల్.గోపాలరావు, ఏపీఎం పి.అప్పలనాయుడు తదితరులు పర్యవేక్షించారు.

వృద్ధులకు కంటి పరీక్షలు



వృద్ధులకు నేత్ర పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారి నగేష్‌రెడ్డి

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం సందర్భంగా కురుపాం సామాజిక ఆరోగ్య కేంద్రంలో జిల్లా అంధత్వ నివారణ సంస్థ నేత్ర వైద్యాధికారి జీరు నగేష్ రెడ్డి మంగళవారం వృద్ధుల కోసం నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 25 మంది వృద్ధులకు నేత్ర పరీక్షలు చేశారు. 10 మందికి దృష్టి దోషం ఉన్నట్లు గుర్తించి కళ్లద్దాలకు సిఫార్సు చేశారు. మరో 9 మందికి అంతర కుసుమం(కాట్రాక్ట్) ఉన్నట్లు గుర్తించి కంటి శస్త్రచికిత్స కోసం ఎంపిక చేశారు. వారికి త్వరలో శస్త్రచికిత్సలకు తరలించనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం కంటి సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నేత్రదానంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆరోగ్య మిత్ర సురేష్ ఉన్నారు.


ఇద్దరు వ్యక్తులపై దాడి

మక్కువ: మండలంలో చెముడు గ్రామానికి చెందిన గొట్టాపు మనోహరరావు, ఆయన సోదరుడు కృష్ణమూర్తిపై గుర్తుతెలియని వ్యక్తులు దాడి చేసి పరారయ్యారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఓ మహిళతో పాటు, ఆరుగురు వ్యక్తులు విశాఖపట్నం నుంచి రెండు కార్లలో చెముడు గ్రామానికి మంగళవారం సాయంత్రం చేరుకొని మనోహరరావు ఇంటికి వచ్చి, అతని మీద దాడి చేసి గాయపరిచారు. దాడినీ అడ్డుకున్న మనోహరరావు సోదరుడు కృష్ణమూర్తిని కూడా గాయపరిచారు. అలాగే ఇంట్లో సామగ్రిని ధ్వంసం చేశారు. గాయాల పాలైన మనోహరరావును, కృష్ణమూర్తిని వారి కుటుంబ సభ్యులు శంబర పీహెచ్‌సీకి తరలించి వైద్య సేవలు అందించారు. మనోహరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు జరిపించనున్నట్లు పోలీసులు తెలిపారు.

నిర్లక్ష్యానికి నిండు ప్రాణం బలి

కొమరాడ: మండలంలోని జాకూరు గ్రామానికి చెందిన విద్యార్థిని కద్రక శారద(14) అనారోగ్యంతో మంగళవారం మృతి చెందింది. విద్యార్థిని కొమరాడ కేజీబీవీలో 9వ తరగతి చదువుతోంది. గత నెల 18న జర్వం రావడంతో పాఠశాల సిబ్బంది కొమరాడ సీహెచ్‌సీలో చేర్పించి చికిత్స అందజేశారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం అదే నెల 23న పార్వతీపురం జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యులు సకాలంలో చికిత్స అందించకపోవడంతో ఆమె ఆరోగ్యం క్షీణించింది. 25న ఆమెను విశాఖపట్నం కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది. సకాలంలో సరైన చికిత్స అందకే విద్యార్థిని ఆరోగ్యం క్షీణించి మృతి చెందిందని ఆమె తల్లిదండ్రులు, గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

వృత్తి విద్య కోర్సులపై అవగాహన



పీఎంశ్రీపై అవగాహన కల్పిస్తున్న హెచ్‌ఎం పాత్రుడు

గరుగుబిల్లి: విద్యార్థులకు వృత్తి విద్యాకోర్సుల పట్ల అవగాహన కల్పించడం జరుగుతుందని స్థానిక జెడ్పీహెచ్‌ఎస్ హెచ్‌ఎం ఎస్ఎల్ పాత్రుడు అన్నారు. మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలల్లో పీఎంశ్రీ పథకం కింద ప్రభుత్వం అమలు చేస్తున్న ఒకేషనల్ కోర్సులను ప్రభుత్వం అమలుపై అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థులకు టైలరింగ్, బ్యాంకింగ్, తదితర కోర్సులపై 30 మంది విద్యార్థులకు శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా మండలంలోని పెద్దూరు గ్రామంలో చేనేత మగ్గాల మీద చీరల తయారీ అంశంపై విద్యార్థులకు క్షేత్రస్థాయి పరిశీలన చేయడం జరిగిందన్నారు. వృత్తివిద్యా కోర్సులను నేర్చుకుంటే భవిష్యత్‌లో ఉపాధి సునాసాయంగా లభిస్తుందన్నారు. ఉపాధ్యాయులు వృత్తి విద్యా ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నవరాత్రి ఉపవాసంపై అవగాహన సదస్సు

సీతంపేట: మండలంలోని జక్కరవలస గ్రామంలో ఆశ్వీయుజ మాసం నవరాత్రి వ్రత ఉపవాస అవగాహన సదస్సు మంగళవారం నిర్వహించారు. అక్షర బ్రహ్మ పురోహితులు ఎస్.ఆనందరావు మాట్లాడుతూ సవర జాతి మనుగడకు మార్గదర్శకాలు మనమే అన్నారు. రానున్న దసరా పూజలు ఏ విధంగా నిర్వహించాలో వివరించారు. సవర భాష, లిపి, సాంస్కృతిక గొప్పతనం, విశిష్టత గూర్చి భావితరాలకు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో ఏవైఎస్ నాయకులు ఎన్.రామారావు, ఎస్.వెంకటరావు, ఎస్.రామారావు, గేసయ్య తదితరులు పాల్గొన్నారు.



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఆనందరావు

చెకుముకి పోటీల్లో చినమేరంగి విద్యార్థుల ప్రతిభ

జియ్యమ్మవలస: మండల స్థాయి చెకుముకి పోటీలలో చినమేరంగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు గెలుపొందారు. మండలంలోని 8 ఉన్నత పాఠశాలల నుంచి 8,9,10వ తరగతులకు చెందిన ఒక్కో విద్యార్థిని మండల స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. వారికి బీజేపురం ఉన్నత పాఠపాఠశాలలో మంగళవారం పోటీలు నిర్వహించారు. భౌతిక శాస్త్రం, జీవశాస్త్రాల నుంచి క్లిష్టమైన అంశాల నుంచి ప్రశ్నలు అడిగారు. చినమేరంగి ఉన్నత పాఠశాలలో భౌతికశాస్త్ర ఉపాధ్యాయులు లేనప్పటికీ విద్యార్థులు మండల స్థాయి పోటీల్లో విజేతలుగా నిలవడంతో విద్యార్థులతో పాటు గైడ్ టీచర్లు విజ్జరాజ్ ఛౌదరి, జగన్మోహనరావు, చంద్రశేఖర్‌లను పాఠశాల హెచ్‌ఎం కె.ముత్యాలు, ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బంది, పాఠశాల కమిటీ చైర్మన్ అభినందించారు.



మండల స్థాయి చెకుముకి పోటీల విజేతలతో ఉపాధ్యాయ సిబ్బంది

మూఢ విశ్వాసాలను పారదోలాలి

పాలకొండ రూరల్: సమాజంలో పేరుకుపోయిన మూఢ నమ్మకాలను, రుగ్మతలను రూపు మాపేందుకు జేవీవీ చేస్తున్న కృషి అభినందనీయమని డిప్యూటీ ఈఓ పి.కృష్ణమూర్తి, ఎంఈఓ కె.సోంబాబు అన్నారు. మండల స్థాయి చెకుముకి టాలెంట్ టెస్టు మంగళవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. ప్రభుత్వ కేటగిరి విభాగంలో చినమంగళాపురం జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు, ప్రైవేటు విభాగంలో సత్య సాయి ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలిచారని వేదిక పాఠశాల హెచ్‌ఎం మీసాల సూర్యనారాయణ అన్నారు. జేవీవీ కన్వీనర్ బీవీ రమణ, ఉపాధ్యాయులు చిన్నారావు, సూర్య, ఎల్. వెంకటరమణ, రమేష్‌పట్నాయక్ పాల్గొన్నారు.



జేవీవీ పోస్టర్లును ఆవిష్కరిస్తున్న ఎంఈఓ, హెచ్‌ఎంలు

వలంటీర్లను విధుల్లోకి తీసుకోవాలి

పాలకొండ రూరల్: గత ప్రభుత్వం నియమించిన వలంటీర్లను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని మండల వలంటీర్లు కోరారు. తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాలను పాలకొండ సబ్ కలెక్టర్, తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయ అధికారులకు, సిబ్బందికి మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విధి నిర్వహణలో తాము రాజకీయాలకు అతీతంగా వ్యవహరించామని, కోవిడ్ వంటి ప్రాణాంతక విపత్తుల్లో నిస్వార్థంగా ప్రజలకు సేవలు చేశామన్నారు. దీన్ని గుర్తించి తమను తిరిగి నియమించాలన్నారు.



సబ్ కలెక్టర్ కార్యాలయ అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న వలంటీర్లు

ఘనంగా అమ్మవారి వారాల పండగ

పాలకొండ: మండలంలోని కొండాపురం గ్రామంలో మంగళవారం వారాల పండగను గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. గ్రామదేవత తంపర పోలమ్మ ఆలయం వరకు ఘటాలతో ఊరేగింపుగా వెళ్లి మొక్కులు తీర్చుకున్నారు. కోలాటం, నృత్యాలు చేస్తూ అమ్మవారికి పూజలు చేశారు. దీంతో కొండాపురం గ్రామంలో ఆధ్యాత్మికత చోటు చేసుకుంది.



కొండాపురంలో కోలాటం ఆడుతున్న మహిళలు

త్వరగా ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయించండి

వీరఘట్టం: మండలంలో పెండింగ్‌లో ఉన్న గృహ నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలని మండల ప్రత్యేకాధికారి సాయికృష్ణ సూచించారు. విక్రమపురం గ్రామంలో నిర్మాణంలో ఉన్న జగనన్న హౌసింగ్ కాలనీలోని ఇళ్ల నిర్మాణాలను ఆయన మంగళవారం పరిశీలించారు. గత ప్రభుత్వాల హయాంలో ఇంత వరకు ఎంత మంది లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలు మంజూరు చేశారు. ఆ ఇళ్ల నిర్మాణాలు ఏయే దశలో ఉన్నాయి, ఎంత మందికి పూర్తి స్థాయిలో బిల్లులు చెల్లించారు, పెండింగ్ బిల్లులు తదితర వివరాలను ఏఈ వినోద్‌ను అడిగి తెలుసుకున్నారు. పెండింగ్‌లో ఉన్న ఇళ్ల నిర్మాణాలు మార్చి నెలాఖరులోపు పూర్తి చేయించాలని సూచించారు. వీరితో పాటు ఎంపీడీఓ వై.వెంకటరమణ ఉన్నారు.



ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న అధికారులు

చీడపీడల పట్ల అప్రమత్తంగా ఉండాలి : ఏడీఏ

వీరఘట్టం: పంట పొలాలకు ఆశించే చీడపీడలపై రైతులు అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయ శాఖ ఏడీఏ రత్నకుమారి అన్నారు. నీలానగరం, తెట్టంగి గ్రామాల్లో మంగళవారం నిర్వహించిన పొలంబడి కార్యక్రమంలో భాగంగా రైతులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. వేసిన ప్రతీ పంటను ఈ–క్రాప్‌లో నమోదు చేయించాలని, తమ పంట పొలాల వివరాలు ఈ–క్రాప్‌లో నమోదు అయ్యాయో.. లేదో సమీపంలో ఉన్న రైతు సేవా కేంద్రాలకు వెళ్లి తెలుసుకోవాలన్నారు. పంటల వివరాలు ఈ–క్రాప్‌లో నమోదు కాకపోతే పంట విక్రయించేటప్పుడు రైతుకు ఇబ్బందులు వస్తాయన్నారు. వీఏఏలు తమ పరిధిలోని రైతుల పంటల వివరాలను కచ్చితంగా ఈ–క్రాప్‌లో నమోదు చేయాలని సూచించారు. అనంతరం సాగులో ఉన్న వరి పంటను పరిశీలించారు. వీరితో పాటు మండల వ్యవసాయ శాఖ అధికారి జె.సౌజన్య ఉన్నారు.



తెట్టంగిలో పొలంబడి కార్యక్రమంలో పాల్గొన్న వ్యవసాయశాఖ అధికారులు

రోడ్డు నియమాలు పాటించాలి

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): వాహనదారులు విధిగా రోడ్డు నియమాలను పాటించాలని నీలకంఠాపురం ఎస్సై నీలకంఠారావు అన్నారు. ఈమేరకు మంగళవారం కురుపాం మండలం నీలకంఠాపురం గ్రామంలో ఆటో డ్రైవర్లు, ద్విచక్ర వాహనదారులు, యువకులకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. రోడ్డు భద్రత నియమాలు ఉల్లంఘిస్తూ వాహనాలను స్పీడ్‌గా నడపడం, ఎక్కడపడితే అక్కడే నిలుపుదల చేయడం, వాహన రికార్డులు కలిగి ఉండకపోవడం, మైనర్లకు వాహనాలు నడిపేందుకు ఇవ్వడం, హెల్మెట్, షీట్‌బెల్టులు ధరించకపోవడం వలన అనేక ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు.